

8లో

## పులి బయటకు వస్తుంది..

- ఇక నక్కలు తొర్రలకు వెళ్లాల్సిందే
- పరకాలను అభివృద్ధి చేసిన ధర్మన్నను గెలిపించాలి
- ఐటీ శాఖ మంత్రి కేటీఆర్


# వరంగల్ వాయిస్

Evening Daily

www.warangalvoice.net

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 95 సోమవారం | 09 అక్టోబర్ 2023 | పేజీలు : 09 | వెల రూ. 5






- నవంబర్ 3న నోటిఫికేషన్, 30న ఎన్నికలు
- డిసెంబర్ 3న ఫలితాలు
- తాడో, పేడో తేల్చుకునేందుకు సిద్ధపడుతున్న పార్టీలు
- అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్

# ఇగ సమరమే

## మోగిన ఎన్నికల నగారా



వివరాలు 2లో..

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తెలంగాణలో నవంబర్ 30వ తేదీన సింగిల్ ఫేజ్ లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు ఎన్నికల నోటిఫికేషన్ నవంబర్ 3న వెలువడనుంది. తెలంగాణలో అధికార బీఆర్ఎస్ హ్యాట్రిక్ దిశగా అడుగులు వేస్తుంటే తమ గెలుపు ఖాయమని కాంగ్రెస్, బీజేపీ చెబుతున్నాయి. అయితే సార్వత్రిక ఎన్నికల ముందు బీజేపీ తమ సత్తా చాటుకోవాల్సిన అవసరం ఏర్పడింది. కర్ణాటక ఎన్నికల్లో గెలుపుతో ఇక దేశం మొత్తం ఇదే రకమైన ఫలితాలు వస్తాయని కాంగ్రెస్ తో సహా ఇండియా కూటమి పార్టీలు అంచనా వేస్తున్నాయి. ఇప్పుడు షెడ్యూల్ విడుదల కావడంతో.. ఇక రాజకీయ సమరానికి పార్టీలు సై అంటున్నాయి. - వరంగల్ వాయిస్ ప్రతినిధి



2లో

## ఇదేనా అభివృద్ధి..?

- అతుకుల బొంతల్లా రహదారులు
- చిన్న పాటి వర్షానికే పలు ప్రాంతాల మునక
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ బాబు

## విజయం ఖరారైంది



8లో

- గులాబీ జెండా నీడలోనే అభివృద్ధి, సంక్షేమం
- కాంగ్రెస్ మాట నమ్మితే మునుగుడే
- మంత్రి కల్వకుంట్ల తారక రామారావు

# ఇగ సమరమే..

## మోగిన ఎన్నికల నగారా






**నవంబర్ 3న నోటిఫికేషన్, 30న ఎన్నికలు**

**డిసెంబర్ 3న ఫలితాలు**

**తాడో, పేడో తేల్చుకునేందుకు సిద్ధపడుతున్న పార్టీలు**

**అమలులోకి వచ్చిన ఎన్నికల కోడ్**

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. నవంబర్ 30వ తేదీన సింగిల్ ఫేజ్ లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ప్రకటించారు. ఈ మేరకు ఎన్నికల నోటిఫికేషన్ నవంబర్ 3న వెలువడనుంది. అదే రోజునుంచి నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభం అవుతుంది. 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల పరిశీలన 13 వ తేదీ వరకు జరుగుతుంది. నవంబరు 15 న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగుస్తుంది. షెడ్యూల్ ప్రకటన నేపథ్యంలో తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. రాష్ట్ర అసెంబ్లీకి జనవరి 16వ తేదీ వరకు వెసులుబాటు ఉన్నప్పటికీ మిజోరాంతో కలిసి ఎన్నికలు నిర్వహిస్తున్నందున నెల రోజుల ముందుగానే పోలింగ్ ప్రక్రియ పూర్తికానుంది.

### 119 నియోజకవర్గాలు..

రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాలుండగా వాటిలో 19 ఎస్సీ, 12 ఎస్టీ రిజర్వు స్థానాలున్నాయి. కాగా మిగిలిన 88 జనరల్ స్థానాలుండగా వీటిలో 36శాతం మహిళలకు రిజర్వ్ చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 3,17,32,727 మంది ఓటర్లు ఉన్నారు. వీటిలో 1,58,71,493 మంది పురుషులు కాగా 1,58,43,339మంది మహిళలు ఉన్నారు. ఇందుకుగాను మొత్తం 35,356 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 14,464 కేంద్రాలు పట్టణ ప్రాంతాల్లో ఉండగా, 20,892 గ్రావిరీణ ప్రాంతాల్లో ఉన్నాయి. సగటున ప్రతి పోలింగ్ కేంద్రంలో 897 మంది ఓటర్లు ఉన్నారు. 27,798 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఇక 597 పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా మహిళలకు కేటాయించారు. అదేవిధంగా 644 మోడల్ కేంద్రాలు, మరో 120 పోలింగ్ కేంద్రాలను వికలాంగుల కోసం ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు.

### అధికారం మాదంటే మాదే..

ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన అధికార బీఆర్ ఎస్ తోపాటు కాంగ్రెస్, బీజేపీలు త్వరలో తెలంగాణలో జెండా ఎగుర వేసేది మేమంటే మేమంటూ ప్రకటించుకుంటున్నారు. బీఆర్ ఎస్ విజయం సాధించడం ఖాయమైపోయిందని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కాబోతున్నారంటూ ఆపార్టీ నేతల పెద్ద ఎత్తున ప్రచారం సాగిస్తున్నారు. ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన గులాబీ అధినేత కేసీఆర్, ఈసారి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసుకోవడానికి ఏ చిన్న అవకాశాన్ని కూడా వదలకూడదని నిర్ణయించారు. కర్నాటక ఫార్ములానే ఇక్కడ కూడా అమలు చేస్తున్నందున విజయం మాదే అన్న ధీమతో కాంగ్రెస్ పార్టీ ఉంది. ఇక గోల్కొండ కోటపై కాశాయం జెండా ఎగురవేయడం ఖాయమని బీజేపీ వర్గాలు చెప్పుకొస్తున్నాయి. ఏది ఏమైనా త్వరలో జరగనున్న ఎన్నికల్లో అనేక నియోజకవర్గాల్లో ముక్కోనపు పోటీ ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెప్పకొస్తున్నారు.

### డిజిటల్ పబ్లిసిటీ..

త్వరలో జరుగనున్న ఎన్నికల్లో డిజిటల్ పబ్లిసిటీ కీలకంగా మారనుంది. కొత్త కొత్త ఆలోచనలతో ప్రజల ముందుకు వచ్చేందుకు అన్ని పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. మహిళలు, ముఖ్యంగా యూత్ కు దగ్గరయ్యేందుకు డిజిటల్ యాప్ ల ద్వారా ప్రచారంలో దూసుకుపోవాలని భావిస్తున్నారు. ఈ కామర్స్ సైట్లతో పాటు, సోషల్ మీడియాలో కూడా తమ ప్రచారాన్ని కొనసాగించేలా చర్యలు చేపడుతున్నారు. అమేజాన్, ఫ్లిప్ కార్ట్, పేటీఎం, ట్విట్టర్, యూట్యూబ్, ఫేస్ బుక్, ట్రూకాలర్ వంటి వేదికలను ఏమాత్రం మిస్ చేసుకోకుండా విరివిగా వాటిని ఉపయోగించే మొబైల్ యూజర్లకు బాగా చేరువయ్యేందుకు ప్లాన్లు వేస్తున్నారు. మొబైల్ ప్రచారం ద్వారా ఎక్కువమందికి రీచ్ అవుతామని భావిస్తున్నారు. ఇంటింటి ప్రచారాలతోపాటు మొబైల్ లో వివిధ యాప్ ల ద్వారా ప్రచారాన్ని నిర్వహిస్తే మంచి ఫలితం ఉంటుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

### అమలులోకి ఎన్నికల కోడ్..

ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో తెలంగాణలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఈ రోజునుంచే ఎన్నికల వ్యయం అములులోకి వస్తుంది. ఎన్నికల నియమావళి వెలువడ్డాక ఎలాంటి గ్రాంట్లు, చెల్లింపులు చేయకూడదు. కొత్త పథకాలు ప్రకటించకూడదు. శంకుస్థాపనలు చేయకూడదు. రహదారుల నిర్మాణం, తాగునీటి వసతులపై హామీలు ఇవ్వకూడదు. అధికార పార్టీకి చెందిన నేతలు అధికార దుర్వినియోగానికి పాల్పడకూడదు. పార్టీ పనులకు పాలన యంత్రాగాన్ని వినియోగించుకోకూడదన్న నిబంధన అములోకి వస్తుంది. అధికార పర్యటనలు, పార్టీ ప్రచార పర్యటనలు రెండూ కలిపి ఉండకూడదు. ముఖ్యమంత్రితో సహా ఎవరైనా సరే హెలికాప్టర్‌తోపాటు ఇతర ప్రభుత్వ వాహనాలను ఉపయోగించకూడదు. ఇంటి నుంచి కార్యాలయానికి, కార్యాలయం నుంచి ఇంటికి తప్ప మరే ఇతర పనులకు ప్రభుత్వ వాహనాలను ఉపయోగించకూడదు. సెక్యూరిటీ వాహనాల్లోనూ మూడు కంటే ఎక్కువ వాడితే దాన్ని ఎన్నికల వ్యయం కింద సంబంధిత పార్టీ చూపించాలి. ప్రభుత్వ వసతి గృహాలు, సభా స్థలిలు, హెలిప్యాడ్‌లు... తదితర సౌకర్యాలను కేవలం అధికా రపార్టీ వారి వినియోగానికే కాకుండా ఇతర పార్టీలకూ అవకాశం కల్పించాలి. పత్రికల్లో, టీవీల్లో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రచారానికి ప్రకటనలు ఇవ్వకూడదు. టీవీల్లో ప్రకటనలు ఇచ్చే ముందు దానికి సంబంధించిన సీడీని ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన కమిటీకి చూపించి, అనుమతి పొందాల్సి ఉంటుంది.

# పులి బయటకు వస్తుంది..

**ఇక నక్కలు తొర్రలకు వెళ్లాల్సిందే**

**పరకాలను అభివృద్ధి చేసిన ధర్మన్నను గెలిపించాలి**

**ఐటీ శాఖ మంత్రి కేటీఆర్**



**వరంగల్ వాయిస్, పరకాల :** రాబోయే ఎన్నికల్లో గెలిచేది బీఆర్ఎస్ పార్టీ అని ఐటీ శాఖ మాత్యులు కేటీఆర్ అన్నారు. పరకాల పట్టణంలో సోమవారం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ నివేదన సభకు ముఖ్యఅతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులి బయటకు వస్తుంది.. మొరిగే నక్కలన్నీ పారిపోతాయంటూ కాంగ్రెస్, బీజేపీలను ఉద్దేశించి అన్నారు. పరకాలను అన్ని రకాల అభివృద్ధి చేసిన చల్లా ధర్మారెడ్డిని ఎమ్మెల్యేగా మూడోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. పరకాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, ఇలాంటి ఎమ్మెల్యే పరకాలకు అవసరమన్నారు. సంక్షేమ పథకాలు ఎవరికి రాకున్నా తన కడుపులో పెట్టుకొని కాపాడుకునే ముఖ్యమంత్రి మన కేసీఆర్ అని ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని హామీ ఇచ్చారు. కర్ణాటక నుంచి కాంగ్రెస్ కు, గుజరాత్ నుంచి బీజేపీకి డబ్బులు వస్తాయని ఆ డబ్బులు ఆశ చూపి పరకాల ప్రజలను మోసం చేసేందుకు నక్కజితులు వేస్తారన్నారు. ఎవరు ఎన్ని చెప్పినా పరకాల నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్రంలో గెలిచేది మన ప్రభుత్వమేనని అన్నారు. ప్రతి ఒక్కరు రాబోయో ఎన్నికల్లో ముఖ్యమంత్రిని భారీ మెజారిటీతో గెలిపించాలని పరకాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్, చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# ఇదేనా అభివృద్ధి..?

**అతుకుల బొంతల్లా రహదారులు**

**చిన్న పాటి వర్షానికే పలు ప్రాంతాల మునక**

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ బాబు**

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** గ్రేటర్ వరంగల్ మహా నగరంలో జరిగిన అభివృద్ధి సూక్ష్మ రూపంలో ఉండేసరికి బూతద్దాలతో వెతికినా కనిపించడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వరంగల్ తూర్పు కంటెస్టేడ్ ఎమ్మెల్యే కుసుమ సతీష్ బాబు ఆరోపించారు. ఇంటింటికి బీజేపీ.. ప్రతీ ఇంటికి మోదీ కార్యక్రమంలో భాగంగా సోమవారం 34వ డివిజన్ అధ్యక్షుడు సామల నిరంజన్, 35వ డివిజన్ అధ్యక్షుడు ఇనుముల అజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కుసుమ సతీష్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి శివనగర్ లో అసంపూర్తిగా మురుగు నీటితో నిలిచిన నాలాల్లో పేవర్ పడవలను వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన తూర్పు ఎమ్మెల్యే నరేందర్ నీ ఇంటి ముందే ఏడాదిగా అండర్ డ్రైనేజి పనులు ఎందుకు నిలిచి పోయాయాని ప్రశ్నించారు. చిన్న చిన్న వర్షాలకే ఈ ప్రాంతంతోపాటు 33,34 డివిజన్లలో వందల కొద్ది ఇండ్లు ఎందుకు నీట మునుగు తున్నాయన్నారు. అభివృద్ధి పేపర్లపైనే కనిపిస్తుందన్నారు. అభివృద్ధి అంటే పోలీసుల పహారాలో సంక్షేమ పథకాలను కార్యకర్తలకు, అనుచరుకు పంచుకోవడం కాదంటూ హితవు పలికారు. కొట్లాడి తెచ్చిన మూడువేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు ఎక్కడ చేశారో ప్రజలకు భాహిరంగంగా శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకల రఘునరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి భైరీ శ్యాం సుందర్, భైరీ మురళీ కృష్ణ, భైరీ నాగరాజు, ఆడెపు వేంకటేష్, మాచర్ల దీన్ దయాళ్, మైదం వీరాస్వామి, శరత్, కనుకుంట్ల సాయి, స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# టీఎస్పీఎస్సీ వైఫల్యాలను నిరసిస్తూ 14న రాస్తారోకో

**అఖిలపక్ష పార్టీల పిలుపు..**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** టీఎస్ పీఎస్సీ వైఫల్యాలను నిరసిస్తూ 14 న ఉదయం 10.30 గంటల నుంచి 12.30 వరకూ రాష్ట్రంలో నాలుగు రహదారులపై రాస్తారోకో నిర్వహించాలని అఖిల పక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఉమ్మడి వేదికలు పిలుపునిచ్చాయి. టీఎస్ పీఎస్సీ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో విద్యార్థి, యువజన వర్గాలు తీవ్ర నిరాశలో కూరుకుపోయారన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్, తెలంగాణ జన సమితి, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, న్యూ డెమోక్రసీ, ప్రజా పంథా పార్టీలు, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, పీడీఎస్ యూ, ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి సంఘాలు పాల్గొన్నాయి.

## కాన్షీరాంకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని పత్తిపాక గ్రామంలో సోమవారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కాన్షీరాం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అధ్యక్షుడు కొంగర విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ఓట్లు మావీ.. సీట్లు మీవా, ఓట్లు మావే.. సీట్లు మావే అని బహుజన సమాజ్ పార్టీని స్థాపించిన అసలు సిసలు బహుజన నాయకుడు కాన్షీరాం ఒక్కరే అని అన్నారు. దళిత మహిళ ముఖ్యమంత్రిని చేసిన ఘనుడు కాన్షీరాం అని కొనియాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు చట్ట సభల్లో ఉన్నప్పుడే మీ సమస్యలు పరిష్కారమవుతాయని గుర్తించి అణగారిన వారిని చట్ట సభల్లోకి పంపిన కాన్షీరాంను కూడా కులానికే పరిమితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నాలిక శ్రీకాంత్, కునవల్ల సాయితిలక్, కునమల్ల సాయి రక్షన్, ప్రమోద్, కళ్యాణ్, సుమన్ పాల్గొన్నారు.

## కాటారంలో ఆర్డీవో కార్యాలయం ప్రారంభం



**వరంగల్ వాయిస్, కాటారం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం రెవిన్యూ డివిజన్ కార్యాలయం నూతనంగా ఏర్పాటైంది. ఈ మేరకు సోమవారం కాటారంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. నూతన ఆర్డీవోగా నారాయణను నియమించారు. కాగా ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన ఆర్డీవోకు కాటారం తహసీల్దార్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది, కాటారం పాత్రికేయులు ఆర్డీఓ నారాయణను కలిసి అభినందనలు తెలిపారు.

## అభివృద్ధిలో దూసుకుపోతున్న 6వ డివిజన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ పరిధిలోని 6వ డివిజన్ అభివృద్ధిలో దూసుకుపోతుందని స్థానిక కార్పొరేటర్ చెన్నం మధు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ చీఫ్ విప్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆదేశానుసారం సోమవారం 6వ డివిజన్ బొక్కలగడ్డలోని ఈద్గా చర్చి కాలనీలో రూ.25లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ చెన్నం మధు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కార్పొరేటర్ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, డివిజన్ అధ్యక్షుడు మడిపెల్లి సుమన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బజ్జురి అజయ్ కుమార్, అజాజ్ అహ్మద్, హసీఫ్, బీఆర్ ఎస్ ముఖ్యనాయకులు, కాలనీ కమిటీల సభ్యులు, కాలనీ వాసులు, వర్క్ ఇన్ స్పెక్టర్ రఘు, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

# విద్యా, వైద్య రంగాలకు సీఎం కేసీఆర్ పెద్దపీట



### పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు

**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** పేదోడిపై ఆర్థికబారం పడనీయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ గొప్పగా ఆలోచన చేస్తున్నారని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్, పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేద వర్గాల సంక్షేమం గురించే ఆలోచన చేస్తుందని, వారి అవసరాలకు అనుగుణంగా పథకాలు, అభివృద్ధి పనులు చేస్తోందని ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా విద్యా, వైద్యం విషయాల్లో పేదలపై ఆర్థికబారం పడకుండా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా మాతా, శిశు ఆస్పత్రులు, డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ఆడబిడ్డల కాన్పు తల్లిదండ్రులకు భారం కావద్దని మాతా, శిశు ఆస్పత్రులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు డయాలసిస్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా అందుబాటులో ఉండేలా డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మంథని నియోజకవర్గంలోని మారుమూల ప్రాంతమైన మహదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రత్యేకచొరవ తీసుకుని కేంద్రాన్ని మంజూరీచేయించారని, ఇందుకు భూపాలపల్లి జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్ ఎంతో కృషి చేశారని ఆయన తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి అన్ని వసతులు కల్పించే ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని, ప్రజా సమస్యల తీర్చే ఏకైక ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ అని ఆయన కొనియాడారు.

## ముందస్తు అరెస్ట్ సిగ్గు చేటు




**వరంగల్ వాయిస్, పరకాల :** కేటీఆర్ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి పరకాల పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్, పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కటుకూరి దేవేందర్ రెడ్డి, పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, జిల్లా నాయకులు రంజాన్ అలీ, పరకాల పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మచ్చ సుమన్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా బుర్ర దేవేందర్ గౌడ్ గారు మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే ధర్మా రెడ్డికి రోజు రోజు గ్రామాలలో ఎక్కడ చూసిన అన్ని వర్గాల ప్రజలు అడ్డుకోవడం సహించలేక ఆ భయంతోనే నేడు కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు కాబట్టే ప్రజలు తిరగబడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను ప్రజల స్వాగతిస్తున్నారని, పరకాల గడ్డమీద కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని తెలిపారు.

## ఆర్డీఓ ఆఫీస్ ప్రారంభించిన జడ్పీ చైర్మన్లు



**వరంగల్ వాయిస్, కాటారం:** గత నెల రోజుల క్రితం రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం తుది నోటిఫికేషన్‌ను ఆదివారం విడుదల చేసింది. ఈ క్రమంలో సోమవారం కాటారంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాన్ని భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేష్, పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ ప్రారంభించారు. కాటారం రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని, దూరభారం తగ్గుతుందని ఆయన అన్నారు. అనంతరం కాటారం రెవెన్యూ డివిజనల్ అధికారిగా నియమితులైన నారాయణకు స్వాగతం పలుకుతూ శాలువాతో సన్మానించారు. జిల్లాల ఏర్పాటు తర్వాత కాటారం రెవెన్యూ ఏర్పాటు కలను బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జి, జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ నెరవేర్చారని ఎంపీటీసీ తోటజనార్ధన్ అన్నారు. అనేక ఏండ్లుగా కాటారం వాసులు డివిజన్ కేంద్రంగా ఏర్పాటుకు ఎదురుచూస్తున్న క్రమంలో ఎట్టకేలకు ఆ కలను ఆయన సాకారం చేరని సర్పంచ్ తోట రాధమ్మ అన్నారు.

# కేటీఆర్ పర్యటనను వ్యతిరేకిస్తూ బీజేపీ బంద్




**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాలకు ఏం న్యాయం చేశావని వస్తున్నావని కేటీఆర్ ను మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి ప్రశ్నించారు. కేటీఆర్ పర్యటన నిరసిస్తూ పరకాల బంద్ కు సహకరించాలని పరకాల పట్టణ వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు, ప్రజలను కోరారు. పరకాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి పాల్గొన్నారు. 2012-13లో నూతన మున్సిపాలిటీ కార్యాలయం ,సెంట్రల్ లైటింగ్ కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన మొలుగూరి భిక్షపతి శిలాఫలకాన్ని పరకాల ఎమ్మెల్యే తీసివేయడం హాస్యాస్పదమని అన్నారు. తిరిగి శిలాఫలకాన్ని నిర్మించకుంటే రేపటి నుంచి పరకాలలో ఎమ్మెల్యే శిలాఫలకాలు కనపడని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం గెలవడం ఖాయమని, ప్రజా సంక్షేమం దిశగా అడుగులు వేస్తుందని అన్నారు. బీజేపీ కార్యవర్గ సభ్యులు కాచం గురు ప్రసాద్, కొత్తగూడెం ప్రభారి దేవునూరి మేఘనాథ్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ పి జయంత్ లాల్ మాట్లాడుతూ పరకాల ఆకాంక్ష అమరవీరుల జిల్లా చేయనందుకు కేటీఆర్ పర్యటన వ్యతిరేకిస్తూ పరకాల బంద్ కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మేకల రాజు వీరు, పరకాల పట్టణ కౌన్సిలర్ కోలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణ చారి , ఉపాధ్యక్షులు నాగేల్లి రంజిత్, పాలకుర్తి తిరుపతి, మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, సీనియర్ నాయకులు మారేడుగొండ భాస్కరాచారి, దుబాసి వెంకటస్వామి, ఆకుల రాంబాబు, ముత్యాల దేవేందర్, వార్డు సభ్యులు దారుణ నారాయణదాసు, బలబద్ర రాజు, బొచ్చు వరప్రసాద్ పాల్గొన్నారు.

# ఘనంగా హోమియోపతి సీఎంఈ ప్రోగ్రాం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఓరుగల్లు హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్, ఐఐహెచ్ పీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం అశోక హోటల్ లో సీఎంఈ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ ప్రోగ్రామ్‌కు ముఖ్యఅతిథిగా సీనియర్ హోమియో ఫిజీషియన్ డాక్టర్ రామదాసు లంక, డాక్టర్ లక్ష్మీనారాయణ సిటీ సర్జన్ , డాక్టర్ సందీప్ న్యూరో ఫిజీషియన్ పాల్గొన్నారు. ప్రెడేక్టివ్ హోమియోపతి గురించి డాక్టర్ రామదాసు లంక వివరించారు. ఈ కార్యక్రమంలో ఓరుగల్లు హోమియో పతిక్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ భీమగాని లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కె.సుధాకర్‌రావు, వైస్ ప్రెసిడెంట్ పీవీ.కమల కిషోర్, డాక్టర్ రేవతి ప్రధాన కార్యదర్శి డాక్టర్ నామసాని రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ పావుశెట్టి శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ వీవీ రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ బాసాని శ్రీకాంత్, ఈసీ మెంబర్స్ డాక్టర్ బి. పవన్‌కుమార్, డాక్టర్ డి.మాధవరావు, డాక్టర్ సాయి కృష్ణ, డాక్టర్ గీతా లక్ష్మి, డాక్టర్ ఆర్. కీర్తి, డాక్టర్ బి.మంజుల, డాక్టర్ శౌరి, సీనియర్ హోమియో ఫిజీషియన్ వీఎస్.రెడ్డి, డాక్టర్ మమత, డాక్టర్ విజయలక్ష్మి, పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో ఐఐహెచ్‌పీ రాష్ట్ర ప్రతి నిధులు డాక్టర్ ఎంఎన్.రాజు, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ మానస, డాక్టర్ శ్రీనివాసమూర్తి, డాక్టర్ గణేష్ ఆచార్య, డాక్టర్ ఎంవీఎల్ నరసింహారావు, డాక్టర్ నాగేందర్ కుమార్ ఉపాధ్యాయ అలాగే కరీంనగర్ అధ్యక్షుడు డాక్టర్ దీపక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# కేసులకు భయపడను

## మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే పెద్దమ్మగడ్డకు చెందిన అంబేద్కర్ రాజు చేత నాయిని రాజేందర్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించారని మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి ఆరోపించారు. హనుమకొండ హంటర్ రోడ్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఆరు గ్యారెంటీ అంశాల మీద రెండు రోజుల క్రితం 4వ డివిజన్ పెద్దమ్మ గడ్డకు వెళ్లామని ఆ సమయంలో నాయిని అనుచరుడు అంబేద్కర్ రాజు మమ్మల్ని అక్కడ ప్రచారం చేయకుండా ఆపి ఇక్కడ ప్రచార చేయొద్దని మాపై దాడీ చేసే ప్రయత్నం చేశాడని తెలిపారు. ఇది నాయిని అడ్డా అని ఇక్కడకు రావొద్దని గొడవ చేయడం కరెక్ట్ కాదన్నారు. ప్రజాస్వామ్యంలో అందరికి అధికారం ఉంది. వాళ్లే రెండు దిక్కుల అటాచ్ చేశారు..మేము 100 ఉన్నాం వాళ్ళు 10 మంది ఉన్నారు. అడుగడుగునా అడ్డు పడ్డారు. మా ఎస్సీ సెల్ సేవా దళ్ నాయకులు అశోక్ ను విపరీతంగా రాడ్లు, కట్టేలతో కొట్టారన్నారు. అలాగే మహిళా నాయకురాలు కత్తుల కవితను, రేణుకను కొట్టారని తెలిపారు. చట్టానికి మేము కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. అంబేద్కర్ రాజు అయితే ఏందీ నాయిని అయితే ఏంటని ప్రశ్నించారు. గతంలో అనిశెట్టి వెపన్ కేసులో మంత్రి దయాకర్ రావు అండగా ఉన్నాడని, ఆంజనేయ స్వామి భూమి కబ్జా కేసులో కూడా నాయిని ఉన్నారని అన్నారు. అన్ని కేసుల్లో నువ్వు కుమ్మక్కై రేవూరి ప్రకాష్ రెడ్డిని ఓడించింది నువ్వేనని నాయినిని విమర్శించారు. నేను ఎప్పుడు ఎస్సీలను కించపరచలేదని, దళిత సామాజిక వర్గమే నాకు అండ అని అన్నారు. నా మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం అన్యాయమని, నాకు కేసులు కొత్త కాదని, బెదిరింపులకు నేను భయపడనని అన్నారు. రాత్రి రాత్రే ఎలా కేసు పెడతారని మంత్రి ఎర్రబెల్లి, చీఫ్ విప్ వినయ్ భాస్కర్ లు కేసు వెనక ఉన్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంటెస్ట్ కార్పొరేటర్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా,కిసాన్ సేవాదళ్ యూత్, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ



**వరంగల్ వాయిస్, కాటారం :** ఛత్రపతి శివాజీ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మండల కేంద్రమైన కాటారం గారెపల్లిలో జాతీయ రహదారిపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా గల చౌరస్తాలో సోమవారం సర్పంచ్ తోట రాదమ్మ, ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్ భూమి పూజ నిర్వహించారు. ఛత్రపతి శివాజీ ఆదర్శ పరిపాలన కొనసాగించారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాచర్ల రాజేందర్, పసుల శంకర్, చీమల రాజు, గౌరోజు రోశయ్య, గోనె మహేష్, సతీష్, తిరుపతి, రాము పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అరూరికి నిరసన సెగ



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** పట్టణ కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, మునిసిపల్ ఆఫీసు ప్రారంభోత్సవం సందర్భంగా వచ్చిన ఎమ్మెల్యే అరూరి రమేష్ ను మంచి నీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక మహిళలు నిరసన తెలుపుతూ వాహనాన్ని అడ్డుకున్నారు. కాలనీవాసులు గత తొమ్మిది సంవత్సరాలుగా మంచినీళ్లు కావాలని ఎన్నిసార్లు స్థానిక కౌన్సిలర్ ను, మున్సిపల్ కమిషనర్ ను వేడుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఇంటింటికి మిషన్ భగీరథ ద్వారా నీళ్లు ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం చాలా సిగ్గుచేటని కాలనీవాసులు రోడ్డుపై బైఠాయించి పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. దీంతో రోడ్డుకిరువైపులా భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఆ తర్వాత ఎమ్మెల్యే వారిని పిలిపించుకొని మాట్లాడి సమస్యను తీరుస్తామని చెప్పడం జరిగింది.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థపాన



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని కామారెడ్డిపల్లి గ్రామంలో సోమవారం స్థానిక శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి పర్యటించారు. పర్యటనలో భాగంగా రూ.15 లక్షలతో సీసీ, డ్రైన్స్ పనులకు శంకుస్థాపన,రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన మహిళా భవనం ప్రారంభించారు. అలాగే పోచారం గ్రామంలో రూ.4 కోట్ల 40లక్షలతో నూతనంగా నిర్మించిన హైలెవెల్ బ్రిడ్జి, రూ.13లక్షలతో నిర్మించిన మహిళా భవనం, రూ.50లక్షలతో గ్రామంలో నూతనంగా వేసిన అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ కాలవలు ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సొసైటీ, మార్కెట్ చైర్మన్లు, కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పట్టణంలోని 12వ వార్డు మార్కండేయ టెంపుల్ ఏరియాలో స్థానిక కౌన్సిలర్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్ ఆధ్వర్యంలో అజీజ్ ఇంటి నుంచి మార్కండేయ స్వామి ఆలయం వరకు మున్సిపల్ సాధారణ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, డీఈ ఉపేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మార్నేని వెంకన్న, 29వ వార్డు కౌన్సిలర్ సూర్ణపు సోమయ్య, వార్డు పెద్దలు మల్కా కృష్ణమూర్తి, ఏనుగు మహేందర్ రెడ్డి, కొప్పుల శ్రీనివాస్ రెడ్డి, ఎస్వీ నాగేశ్వరరావు, పెనుగొండ నలిన్, శ్రీరంగం వెంకన్న, భూక్య నెహ్రూ, సామ శ్రీనివాస్, తవుటం శీను, కట్ట పుల్లయ్య, ఆవుల వెంకన్న, వంశీ, శివ, రాజు, డింపుల్ పాల్గొన్నారు.

# బీజేపీ నేత పెసరు హౌస్ అరెస్ట్



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాలలో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో బీజేపీ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్ట్ చేశారు. ఉదయమే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి నివాసానికి పోలీసులు చేరుకొని వారి నివాసంలోనే హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలలో ప్రభ కోల్పోతున్న చల్లా ధర్మారెడ్డిని రక్షించేందుకే మంత్రి కేటీఆర్ పర్యటన అని ఎద్దేవా చేశారు. అభివృద్ధి లేదు, శంకుస్థాపనల పర్యటనతో పరకాల ఒరిగేదేముందని ప్రశ్నించారు. అభివృద్ధి పనులు చేయడానికి వచ్చే మంత్రి ప్రతిపక్ష నాయకులను ముందస్తు అరెస్టు చేయటానికి ఏంటి సంబంధమన్నారు. పరకాల అనేక సమస్యలతో సతమతమవుతుందని ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు.

# నిరుపేదలకు ఇండ్ల పట్టాల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్నో సంవత్సరాల నుంచి ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం, తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చొరవతో పట్టాలు అందజేయడం జరుగుతుందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. ఆయన సోమవారం అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఖిలా వరంగల్ మండలం ఆర్ఐ ఆనంద్ కుమార్, నాయకులు ముష్కమల్ల సుధాకర్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్, నగర నాయకులు వగిలిశెట్టి అనిల్ కుమార్, కోరే కృష్ణ, వీఆర్ఏలు అన్నం సదానందం, రమేష్ లతో పాటు లబ్ధిదారులు ఉన్నారు.

# చీఫ్ విప్ దాస్యంను కలిసిన టీపీఎండబ్ల్యూజేఏ ప్రతినిధులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రింట్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రతనిధులు సోమవారం వరంగల్ పశ్చిమ నియోజక వర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ను కేయూ ఎస్ డీ ఎల్ సీ క్యాంపస్ లో మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలను వినతి పత్రం ద్వారా విన్నవించారు. ప్రస్తుతం ప్రింట్ మీడియా పత్రిక రంగంలో పనిచేస్తున్న విలేకరుల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందని, వివిధ రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు ఏర్పాటు చేస్తున్న విలేకరుల సమావేశంలో అనేక సమస్యలను ఎదుర్కొంటు వివక్షతకు గురవుతున్నామని తెలిపారు. ప్రెస్ కాన్ఫరెన్స్ లో సరైన పద్ధతిలో సీట్ల ఏర్పాటు లేని కారణంగా ఎక్కడో ఒక మూలాన నిలబడి వార్తలు సరిగా విని వినపడకుండా అసలు సారాంశం అర్థం చేసుకోలేకపోతున్నామని, ఈ విషయం పరిగణలోకి తీసుకొని ప్రింట్ మీడియాకు సపరేటు సీట్లను ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని కోరారు . వినతి పత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ కన్వీనర్ కొల్లా కృష్ణ కుమార్, కోకన్వీనర్స్ కంకణాల సంతోష్, కట్కూరి రవికుమార్, చింతల సత్యనారాయణ, ఊటుకూరి సాయిరాం, గౌరవ సలహాదారులు నాయకపు సుభాష్, బొల్లారం సదయ్య, సీనియర్ జర్నలిస్ట్ జగన్, రిపోర్టర్స్ ప్రశాంత్, అర్షం రాజ్ కుమార్, డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్, గుండె కుమార్ ఉన్నారు.

## బాబూరామ్ శర్మ మృతి సీపీఐఎంఎల్‌కు తీరని లోటు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పార్టీ కేంద్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు, పార్టీ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ బాబూ రామ్ శర్మ మృతికి సీపీఐ(ఎం.ఎల్) ఆర్ఐ సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ సంతాపం వ్యక్తం చేసింది. కామ్రేడ్ శర్మ విద్యార్థి ఉద్యమంతో అనుబంధం కలిగి ఉన్నాడు. ఆ తర్వాత చారిత్రక నక్సల్బరీ రైతు ఉద్యమం స్ఫూర్తితో రాజకీయ ఉద్యమంలో చేరాడు. అతని సుదీర్ఘమైన, నిరంతరాయమైన రాజకీయ జీవితం, రాజకీయ ఉద్యమాలు, వర్గ, సామాజిక పోరాటాలలో చురుకైన ప్రమేయం అతనికి మొత్తం ఉత్తర ప్రదేశ్‌లోని కమ్యూనిస్ట్ విప్లవ ఉద్యమంలో, మొత్తం పూర్వంచల్ ప్రాంతంలోని శ్రమిస్తున్న ప్రజానీకానికి నాయకుడిగా తగిన గుర్తింపునిచ్చాయన్నారు. కామ్రేడ్ బాబు రామ్ మరణం సీపీఐఎంఎల్ పార్టీకి, భారత కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టమని అన్నారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రాత్మక రైతు ఉద్యమంలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రదీప్ సింఘా ఠాకూర్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం పాల్గొన్నారు.

## రాజయ్యకు బీఆర్ఎస్ నాయకుల సన్మానం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** నూతనంగా రాష్ట్ర రైతుబంధు సమితి అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యకు రఘునాథపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీపీ వై కుమార్ గౌడ్, జిల్లా నాయకులు కుర్ర కమలాకర్ గౌడ్, నిడిగొండ గ్రామ శాఖ అధ్యక్షులు తిప్పా రపు బాబురావు , మండల కోఆర్డినేటర్ తిప్పరపు రమ్య శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు వార్డు మెంబర్ నరేష్, బండి కుమార్ గౌడ్, పార్టీ శ్రేణులు, కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్ తదితరులు ఉన్నారు.

## ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా గ్రంథాలయ సంస్థ హనుమకొండలో ఇటీవల విడుదలైన టీఎస్పీఎస్పీ ఎస్సై, కాని స్టేబుల్, వివిధ శాఖలో ఉద్యోగాలు సాధించిన 50మంది గ్రంథ పాఠకులను సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ సెక్రటరీ శశిజా దేవి, గ్రేడ్ 1 ఆఫీసర్ కరుణాకుమరి, గ్రేడ్2 మాల్సుర్, పురుషోత్తంరాజ్, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, కుమారస్వామి, రాజేష్, గ్రంథాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## టెక్నోజిట్స్-23 వాల్ పోస్టర్ ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** జయముఖీ అటానమస్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం అక్టోబర్ 11 నుంచి ప్రారంభమయ్యే సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించే టెక్నోజిట్స్ 2023 వాల్ పోస్టర్ ను వాగ్దేవి, జయముఖి కళాశాల ప్రెసిడెంట్ సీహెచ్ నర్సింహ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జానకి, వైస్ ప్రిన్సిపాల్ డా.పి.శ్రీనివాస రావు, ట్రెజరీ జి.శంకర్ రెడ్డి, డీన్ అకడమిక్ హమీద్ పాషా, ఈఈఈ హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్ డి.రజనీ కుమార్, సివిల్ హెడ్ ఆఫ్ డిపార్ట్మెంట్.సందాని, మెకానికల్ హెడ్ జవహర్, ప్రొఫెసర్ రామకృష్ణ, వరుణ్, పున్నం చందర్, కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల పెన్నిధి సీఎం కేసీఆర్

### చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పేదల పెన్నిధి సీఎం కేసీఆర్ అని ప్రభుత్వ చీఫ్ విప్, పశ్చిమ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. లష్కర్ బజార్ లోని బీసీ స్టడీ సర్కిల్ లో బీసీ, మైనార్టీ బంధు చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బీసీ బంధు 250మంది లబ్ధిదారులకు, 80మంది మైనారిటీ బంధు లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం, కేసీఆర్ సర్కార్ పేదల పక్షపాతి అని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గత ప్రభుత్వాలు ఏనాడు పేద ప్రజల గురించి ఆలోచించిన పాపాన పోలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాతే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో పింఛన్ల కోసం ప్రజలు ఇక్కట్లు పడేవారని, కానీ పదేండ్ల తెలంగాణ ప్రభుత్వ పాలనలో అర్హులకు నేరుగా పింఛన్లు మంజూరు చేయడం జరిగిందని వివరించారు. తెలంగాణలో ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మరోవైపు కేసీఆర్ నాయకత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు. వ్యవసాయ రంగంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి అనేక సాగునీటి ప్రాజెక్టులను నిర్మించడం జరిగిందన్నారు. రైతుల కోసం రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, వ్యవసాయ అధికారుల నియామకం ఇలా అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వివరించారు. తెలంగాణలో వెయ్యికి పైగా సంక్షేమ కార్యక్రమాల అమలవుతున్నారని అన్నారు.తెలంగాణ వచ్చాకే ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి జరిగిందన్నారు. వేల కోట్ల నిధులతో 9ఏండ్ల కాలంలో నగర వ్యాప్తంగా సీసీ రోడ్లు డ్రైన్లు, అనేక మౌలిక వసతుల కల్పన కృషి చేయడం జరిగిందని తెలిపారు. నగరంలోని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి తోడుగా ఉండడం జరిగిందని వివరించారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులను అందించారు. కార్యక్రమంలో మైనార్టీ ఈడీ శ్రీనివాస్, బీసీ ఈడీ రాంరెడ్డి, లబ్ధిదారులు, కార్పొరేటర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



**వరంగల్ వాయిస్, రేగొండ :** భారత ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్రానికి పసుపు బోర్డును (నిజామాబాద్ జిల్లాలో) గిరిజన యూనివర్సిటీని ములుగు జిల్లాలలో ఏర్పాటు చేసినందుకు గాను రేగొండ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడునూతుల నిషిధర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ గత 30ఏళ్లుగా ఏ ప్రభుత్వం చేయలేని పసుపు బోర్డును ఏర్పాటు చేసి పసుపు రైతుల బాధలను తీర్చాడని వెనుకబడిన గిరిజనులకు ఉన్నతమైన విద్యను అందించే విధంగా ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గిరిజన జాతి ప్రజలంతా రాష్ట్రవ్యాప్తంగా మోడీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నారని తెలిపారు. ప్రపంచ దేశాలు మోడీ పాలన దక్షతకు విశ్వ గురువుగా అభివర్ణిస్తున్నారని, కేసీఆర్ నిరుద్యోగులను మోసం చేస్తే మోడీ యూనివర్సిటీ నుంచి గిరిజన పేద విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తున్నాడని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం ఫామ్ హౌస్ లకు పరిమితమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గన్ రెడ్డి లింగారెడ్డి, మెతుకుపల్లి బుచ్చిరెడ్డి, సుదాటి వేణు రావు, ముష్క నరేందర్, పెండ్యాల రాజు, కురాకుల మల్లయ్య, కౌడగానీ రాకేష్, అంబటి రాజకుమార్, కొమ్మిడి తిరుపతిరెడ్డి, అప్పాని చంద్రమౌళి, దాసరి అనిల్, పున్నం రఘు, వంగ రాజయ్య, అన్నారపు సమ్మిరెడ్డి, మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# డీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

### కందుకూరి దేవదాసు



**వరంగల్ వాయిస్, గొర్లవీడు :** మహబూబ్ నగర్ లో జరిగే డీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని డీటీఎఫ్ భూపాలపల్లి జిల్లా సీనియర్ నాయకుడు కందుకూరి దేవదాసు పిలుపునిచ్చారు. సోమవారం భూపాలపల్లి జిల్లా గోర్లవీడు జడ్పీ హెచ్ ఎస్ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలోఆధ్వర్యంలో మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కందుకూరి దేవదాసు మాట్లాడుతూ రాష్ట్రంలో జాతీయ స్థాయిలో విద్యా రంగంలో అనేక పెడధోరణులు బడుగు, బలహీన వర్గాల ప్రజలకు విద్యను దూరంచేసి, సమాజంలో అసమానతలు పెంపొందిస్తున్నాయని, ఈ దశలో సామాజిక చైతన్యం కలిగించడానికి, ఉపాధ్యాయులను చైతన్య పరచడానికి డీటీఎఫ్ మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో అక్టోబర్ 15, 16, 17వ తేదీలలో రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహిస్తున్నదని కావున ఉపాధ్యాయులు, విద్యాభిమానులు, ప్రజాస్వామిక వాదులు, సమాజ హితం కోరే వ్యక్తులు ఎవరైనా డీటీఎఫ్ మహాసభల్లో పాల్గొని సామాజిక చైతన్యం పొంది, మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విద్యా, వైద్య రంగాలకు తక్కువ నిధులు కేటాయిస్తూ సామాన్యులకు ఉచిత విద్య, వైద్యానికి దూరం చేస్తున్నాయని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వాల నిర్ణయాలుండటం లేదని అన్నారు. డీటీఎఫ్ మూడు రోజుల మహాసభల్లో ముఖ్యంగా తొమ్మిది అంశాలపై జాతీయస్థాయి వక్తలచే సమాజ పురోగతికి దోహదపడే ఉపన్యాసాలుంటాయని, ఈ సభలకు హాజరుకావడం జ్ఞానసముపార్జనకు దోహద పడతాయన్నారు. ఈ మహాసభలలో జాతీయ విద్యా విధానం 2020 ఉన్నత విద్యారంగములోని సవాళ్లు అనే అంశంపై డాక్టర్.వికాస్ గుప్తా ఢిల్లీ యూనివర్సిటీ, సంక్షుభిత సమాజంలో రాజకీయ, ఆర్థిక పరిస్థితులు అనే అంశంపై ఎన్.వేణుగోపాల్ వీక్షణం, వ్యవసాయ రంగం రైతాంగ ఉద్యమాలు అనే అంశంపై కన్నేగంటి రవి, ప్రభుత్వాల పాలనలో ప్రజల హక్కులు అనే అంశంపై ప్రొఫెసర్ జి.హరగోపాల్, ప్రజాస్వామ్యంలో ప్రసార మాధ్యమాల పాత్ర అనే అంశంపై కె.శ్రీనివాస్ ఆంధ్ర జ్యోతి సంపాదకులు, సాహిత్యం మహిళలు అనే అంశంపై ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే, కాకతీయ విశ్వవిద్యాలయం, సాంస్కృతిక రంగంలో తిరోగమన ధోరణులు అనే అంశంపై పి. వరలక్ష్మీ విరసం, జాతీయ విద్యా విధానం 2020పాఠశాల విద్యా రంగంలోని సవాళ్లు అంశంపై డి.రమేష్ పట్నాయక్, కార్పొరేటీకరణలో దళితులు, ఆదివాసీలు అనే అంశంపై ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వక్తలుగా పాల్గొంటారని తెలిపారు. బహిరంగ సభలో డాక్టర్ ఎం.ఎఫ్ గోపీనాథ్ భారత్ బచావో జాతీయ ఉపాధ్యక్షుడు, మాధురి జాగృత ఆదివాసీ దళిత సంఘటన్ , మధ్యప్రదేశ్ ప్రసంగిస్తారు. పై అంశాలపై అవగాహన పెంచుకోవడానికి మహా సభలకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా నాయకుడు ఎ.జయప్రకాష్, పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు బి.వెంకటేశ్వర్లు, ఎం.నవనీత్, కే.వంశీ, కే.వాసుదేవ్, జె.మాలతి, జి.సుధాకర్ రెడ్డి, వి.రఘుపతి, సదాశివుడు, మేరీ బాయ్ , సునీత, మమత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలి

## ఘనంగా కాకతీయ మహిళా డిగ్రీ కళాశాల ‘మైత్రి మీట్’

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నక్కలగుట్టలోని కాకతీయ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల్లో స్నేహపూరిత వాతావరణం పెంపొందించడానికి సోమవారం అంబేద్కర్ భవన్ లో ‘మైత్రి మీట్’ నిర్వహించారు. ఈ మీట్ కు కళాశాల ప్రిన్సిపల్ ఈ.రామచందర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా కళాశాల యజమాన్యం గుండా హరి నారాయణ, మట్టేవాడ మాధవ్, ఎం.దయాకర్ హాజరయ్యారు. సరస్వతీ మాత చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా గుండ హరి నారాయణ మాట్లాడుతూ సమాజంలో పురుషులకు ధీటుగా మహిళలు చదువుతోపాటు







అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. మట్టేవాడ మాధవ్ మాట్లాడుతూ లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను, విద్య నేర్పిన గురువులను మరువకూడదన్నారు. ఎం.దయాకర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికను సద్వినియోగం చేసుకొని సమాజంలో ముందుకెళ్లాలని తెలిపారు. అనంతరం చదువులో ప్రతిభ కనబరిచిన, రాష్ట్రంలో ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు ప్రదర్శించిన దేశభక్తి, ఆధ్యాత్మిక, జానపద నృత్యాలు అందనిపీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినిలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ధర్మ యాత్రలో భాగస్వాములు కావాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కరీంబాద్ అంబేద్కర్ యువజన సంఘం, భారతీయ బీఎస్ఐ ఆధ్వర్యంలో అశోక అంబేద్కర్ దమయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి యువజన సంఘం అధ్యక్షుడు జక్కుల రాజు అధ్యక్ష వహించగా ముఖ్యఅతిథిగా బీఎస్ఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ భూమళ్ల అంబేద్కర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశం ముగిసిన అనంతరం నల్గొండ జిల్లా సరిహద్దు వరకు వెళ్లి వీడ్కోలు చెప్పారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దీక్ష భూమిలో తథాగతుడు గౌతమ బుద్ధున్ని బోధిసత్వ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆనవాళ్లు విగ్రహాలు ఉన్నాయి కానీ, బుద్ధుని ధర్మాన్ని విస్తృతపరిచి ప్రజా రంజకంగా పాలించిన సామ్రాట్ అశోకుని విగ్రహం కూడా దీక్ష భూమిలో ప్రతిష్టించాలనే సంకల్పంతో బుద్ధిస్టులు, అంబేద్కర్ రిస్టులు అశోక అంబేద్కర్ దమయాత్రలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు చారిత్రాకమైన ఈ ధర్మ యాత్రలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని కరీమాబాద్ అంబేద్కర్ భవన్ ముందు కరపత్ర ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ భవన కమిటీ అధ్యక్షుడు నీలం మల్లేశం కుల పెద్దమనిషి కడారి కుమార్, మాత రమాబాయి పరపతి సంఘం అధ్యక్షుడు వై మహేందర్, మాతా రమాబాయి మహిళ సంఘం అధ్యక్షురాలు తరాల రాజమణి, నాగమణి, బొమ్మల ఐలయ్య, నీలం స్వామి, బత్తుల రమేష్ బాబు, గోకార రమేష్ బాబు, రవితేజ, సుధాకర్, నీలం శ్యామ్, సురేష్, నీలం రాజు, గుజసురేందర్, ఎరుకల రాజు, గాలి నవీన్పాల్గొన్నారు.

## వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సైకాలజిస్టు స్నేహలతకు చోటు




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వడ్డెపల్లి ప్రాంతానికి చెందిన ప్రముఖ సైకాలజిస్టు పైండ్ల స్నేహలతకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు లభించింది. తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 27 సైకాలజిస్టుల బృందం హైదరాబాద్ నారాయణగూడలో గల ఏఐటీయూసీ భవన్ లో 24గంటల పాటు నిర్వహించిన సుదీర్ఘ వెబినార్ లో సైకాలజిస్టు పైండ్ల స్నేహలత వ్యక్తితం –వక్తిత్వ వికాసంపై సుదీర్ఘంగా ప్రసంగించి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో తన స్థానాన్ని సంపాదించుకుంది. తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోత్కూరు రాంచందర్, ఇరిగేషన్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ ఎస్.వేణుగో పాలచారి, వరల్డ్ రికార్డు దక్షిణ ప్రాంతం సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఉల్లాది ఎలియాంజర్, తది తరులు పైండ్ల స్నేహలతకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్ ను ప్రదానం చేసి అభినందించారు.

# రేపు సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సదస్సు

## ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సదస్సు వరంగల్ నగరంలో శివనగర్ లోని రఘునాథ్ భవన్ లో ఈ నెల 10న ఉదయం 11గంటలకు ప్రారంభమవుతుందని అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు తెలిపారు. ఈ సదస్సులో వివిధ రైతు సంఘాల రాష్ట్ర నాయకులు హాజరై రైతు సమస్యలపై మాట్లాడతారని, సదస్సును జయప్రదం చేయాలని రైతాంగ నాయకులను కార్యకర్తలను ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లఖీంపూర్ కేరిలో రైతులు, విలేకరి మరణానికి కారణమైన అజయ్ కుమార్ మిశ్రాను మంత్రివర్గం నుంచి తొలగించాలని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ప్రదర్శనగా వెళుతున్న రైతులపై వాహనాలతో తొక్కించి కిరాతకంగా హత్య చేసిన అజయ్ కుమార్ మిశ్రా కుమారుడు అశీస్ మిశ్రాను కఠినంగా శిక్షించాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను-పంటల మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని, రుణ విముక్తి చట్టం చేయాలని, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26వేల రూపాయలు ఇవ్వాలని, 57 సంవత్సరాలు నిండిన అందరికీ నెలకు పదివేల రూపాయలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, సామాజిక సేవల కోసం ప్రైవేటీకరణను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, గ్రామీణ ఉపాధి



హామీ పథకంలో 200రోజులు పని కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని, మన రాష్ట్రంలో ప్రభుత్వం కొనసాగిస్తున్న రుణమాఫీ పూర్తి స్థాయిలో త్వరితగతిన చేయాలని, కౌలు రైతులను గుర్తించి రుణ అర్హత కార్డులు ఇవ్వాలని, వారికి బ్యాంకు లోన్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 24 గంటల విద్యుత్తు సరఫరా నిరంతరంగా అందించాలని డిమాండ్ చేశారు.

## పెరుక కుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే నరేందర్ శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, తూర్పు కోట :** ఖిలా వరంగల్‌లో మాజీ కార్పొరేటర్ అచ్చ లక్ష్మీ వీరేశ్ బాబు, అచ్చ విద్యాసాగర్‌ల సొంత భూమి 650 గజాల స్థలాన్నిపెరుక కుల కమ్యూనిటీ హాల్ కోసం బహుకరించారు. ఈ సందర్భంగా కుల పెద్దలందరు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఎమ్మెల్యే ను కోరగా ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులను పెరుక కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ రూ.25లక్షల కేటాయించి నేడు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీర్వాదంతో నియోజకవర్గాన్ని బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచి వారి కోరిక మేరకు ఆత్మగౌరవ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్, వారి కుటుంబ సభ్యులు పెరక కుల సంఘ భవనానికి తమ సొంత స్థలానికి ఇవ్వడం చాలా గొప్ప విషయమని ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థల దాతలు అచ్చ లక్ష్మి వీరేష్ బాబు, కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్, డివిజన్ సంగరబోయిన విజయ్, డివిజన్ ఇంచార్జ్ బిళ్ల రవి, పెరుక సంఘ పెద్దలు చింతం ప్రవీణ్, ఏసీరెడ్డి రమేష్, కర్ణాకర్, ధర్మరాజు, రాంబాబు, అచ్చ లక్ష్మణ్, చందర్, దేవేందర్, జనార్ధన్, రవి, సురేందర్, రమేష్, డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## వయోవృద్ధుల సంక్షేమ సంస్థ నూతన కార్యవర్గం ఎన్నిక



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలో వయోవృద్ధుల సంస్థ సమావేశం సోమవారం నిర్వహించారు. తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం 2007, నియమావళి 2011పై అవగాహన కల్పించారు. చట్టం అమలుకు అందరిపై బాధ్యత ఉందని, ప్రతి డివిజన్ లోనూ అవగాహన కల్పించి వయవృద్ధులకు కురువృద్ధులకు, బ్యాంకు సేవలు ఇంటి వద్దనే చేయాలని, అర్హత కలిగిన వారికి, ఒంటరి మహిళలకు పెన్షన్ సౌకర్యం ప్రభుత్వం కల్పించాలని, వయోవృద్ధులకు బస్సు, రైలు, ప్రత్యేక సీట్లను కేటాయించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని, వృద్ధులకు ఏ సమస్య వచ్చినప్పటికీ 14567 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి వృద్ధుల సమస్యలను తీర్చుకోవాలని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడి కొన్‌రెడ్డి మల్లారెడ్డి, దయానంద్ కాలనీ, ఉపాధ్యక్షులుగా కందుల గోవర్ధన్ పిన్నవారి స్ట్రీట్, ప్రధాన కార్యదర్శి ఎన్. సదానందం, ఫోర్ట్ రోడ్, సంయుక్త కార్యదర్శిగా ఎ.రాజేంద్రప్రసాద్, రామన్నపేట, కోశాధికారిగా ఎ.వీరస్వామి తూర్పు కోట, ఈసీ మెంబర్స్ గా ఇనుగాల జోగి రెడ్డి, తిమ్మాపూర్, మామునూర్, గుండు కోటేశ్వరరావు కాశిబుగ్గ ఎన్నికయ్యారు.

## కోమటిరెడ్డి రాంభూపాల్ రెడ్డికి సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారతీయ జనతా పార్టీ తూర్పు నియోజకవర్గ ప్రభారిగా ఎన్నికై తొలిసారి వరంగల్ తూర్పు నియోజకవర్గానికి విచ్చేసిన కోమటిరెడ్డి రాంభూపాల్ రెడ్డికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ బాబు శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. వారి వెంట రత్నం సతీష్, జిల్లా బీజేపీ నాయకులు భాకం హరిశంకర్, పొట్టి శ్రీనివాస్‌గుప్తా ఉన్నారు.


# ఓ..సి మీ.. తెలివి సంతకెల్లా..



## జూనియర్ ఎన్టీఆర్‌కు జాన్వీకపూర్ మేనత్త అట..?

సోషల్ మీడియాలో కొందరు పెట్టే పోస్టులు చాలా చమత్కారంగా ఉంటాయి. అందులోనూ కొందరు డిజిటల్ క్రియేటర్లు రూపొందించే కంటెంట్‌లో లోపాలను వెతుకుతూ, లేదంటే ఎగతాళి చేస్తూ కొందరు నెటిజనులు పెట్టే పోస్టులు మరీ చమత్కారంగా నవ్వు తెప్పిస్తాయి. మీ క్రియేటివిటీకి ఒక దండంరా బాబూ అనేలా ఉంటాయి. తాజాగా ఎక్స్‌లో వైరల్ అవుతోన్న ఒక పోస్ట్ చేస్తూ ఇదే అనిపిస్తుంది. ఇంత లోతుగా ఎలా ఆలోచిస్తారురా బాబూ అనిపిస్తుంది. దివంగత నటి, అతిలోక సుందరి శ్రీదేవి తెలుగులో ఎన్టీ రామారావు దగ్గర నుంచి చిరంజీవి, నాగార్జున, వెంకటేష్ వరకు ఎంతో మంది హీరోల సరసన నటించారు. అయితే, బాలకృష్ణకు మాత్రం ఆమె హీరోయిన్‌గా నటించలేదు. దీనికి బాలకృష్ణ నిర్ణయమే కారణమనే వాదనలు ఇండస్ట్రీలో ఎప్పటి నుంచో ఉన్నాయి. తన తండ్రితో ఎన్నో సినిమాల్లో హీరోయిన్‌గా నటించిన శ్రీదేవితో తాను ప్రేమికుడిగా, భర్తగా నటించలేనని బాలకృష్ణ అనేవారట. అసలు ఎన్టీఆర్‌కు భార్యగా నటించిన శ్రీదేవి తనకు తల్లితో సమానమని కూడా బాలయ్య అన్నారనే రూమర్లు ఉన్నాయి. ఇదే విషయం చెబుతూ ఎవరో డిజిటల్ క్రియేటర్ ఒక వీడియో చేశారు. అయితే, ఆ వీడియోను ఒక ఎక్స్ యూజర్ పోస్ట్ చేశారు. ఈ వీడియో ఆధారంగా వరుసలు కలుపుతూ జూనియర్ ఎన్టీఆర్‌కు జాన్వీ కపూర్ ఏమవుతారో లెక్కగట్టారు. 'బాలకృష్ణ గారికి తల్లి లాంటిది అంటే జూనియర్ ఎన్టీఆర్‌కి నాయనమ్మ. నాయనమ్మ కూతురు జాన్వీ కపూర్.. జూనియర్ ఎన్టీఆర్‌కి అత్త అవుతుంది. మేనల్లుడు అత్తతో కాంబోనా.. వాట్ ద ఫ× ఇన్ గేమ్ ఆఫ్ థ్రోన్స్ ఈజ్ గోయింగ్ ఆన్ హియర్ (అసలు ఇక్కడ ఏం జరుగుతోంది)' అంటూ సరదాగా ఎక్స్‌లో కామెంట్ చేశారు. అయితే, ఈ పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతుంది. చాలా మంది సరదాగా ఈ పోస్ట్‌కు స్పందిస్తున్నారు. ఇదే సమయంలో సీనియర్ ఎన్టీఆర్‌కు శ్రీదేవి మనవరాలిగా నటించిన విషయాన్ని కూడా కొందరు గుర్తుచేస్తున్నారు. ఏదేమైనా ఇలాంటి పోస్టులను సోషల్ మీడియాలో చూస్తుంటే ఇలా ఎలా ఆలోచిస్తారురా.. మీ తెలివి సంతకెల్లా అని అనిపిస్తుంటుంది.





## అమ్మో.. మా ఆవిడ

తన భార్య జయా బచ్చన్ గురించి బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జయా బచ్చన్ అంటే తనకు చాలా భయమని చెప్పారు. బిగ్‌బీ హోస్ట్ చేస్తున్న 'కౌన్ బనేగా కరోడ్ పతి' టాక్ షోకు ఏ రేంజ్‌లో రెస్పాన్స్ ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈ షో ద్వారా అమితాబ్ తన వ్యక్తిగత విషయాలను కూడా అప్పుడప్పుడూ షేర్ చేసుకుంటున్నారు. ఈ టాక్ షోలో ఇప్పటివరకు వచ్చిన 14 సీజన్‌లు ఊహించని స్థాయిలో రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. ఇక ఇప్పుడు 15వ సీజన్ నడుస్తోంది. తాజా సీజన్‌లో 40వ ఎపిసోడ్‌లో చత్తీస్‌గఢ్‌కు చెందిన జయా పటేల్ అనే మహిళ పాల్గొంది. ఈ సందర్భంగా కంటెస్టెంట్‌ను 'మీరు ఓ టీచర్ అయితే ఎలా ఉంటారు..? స్ట్రిక్ట్‌గానా.. లేక సరదాగా ఉంటారా..?' అని అమితాబ్ ప్రశ్నించారు. దానికి ఆమె 'సార్, నేను టీచింగ్ చేసేటప్పుడు కఠినంగానే వ్యవహరిస్తాను. మిగతా సమయాల్లో సాధారణంగా కూల్‌గానే ఉంటాను' అంటూ చెప్పుకొచ్చింది. అనంతరం కంటెస్టెంట్ జయా పటేల్.. బిగ్‌బీని కూడా జయా బచ్చన్ గురించి ప్రశ్నించింది. దీనికి బిగ్‌బీ సమాధానమిస్తూ.. 'ఆమె (జయా బచ్చన్) నా పట్ల చాలా స్ట్రిక్ట్‌గానే ఉంటుంది. ఆమెతో కలిసి ఈ షో చూసేటప్పుడు నాకు ఉంటుంది. ఆ సీన్ తలచుకుంటుంటేనే నాకు భయంగా ఉంది. అందుకే వ్యక్తిగత విషయాల గురించి పెద్దగా బయటకు చెప్పను' అంటూ అమితాబ్ సరదాగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం బిగ్‌బీ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

## బాలయ్యకు జోడీగా..

మాములుగా బాలయ్య అంటేనే ఒక ఎనర్జీ. లాజిక్‌లు గట్రా పక్కన పెడితే బాలయ్య ఊరమాస్ ఫైటింగ్స్‌కు జనాల్లో పిచ్చ క్రేజ్ ఉంటుంది. ఒక్క తన్ను తంతే సుమోలో గాల్లో ఎగరడాలు, తొడ గొడితే రైల్లు వెనక్కు వెల్లడాలు ఇలా ఇవన్నీ వేరే వాళ్లు చేస్తే అతి అనిపిస్తుంది కానీ.. బాలయ్య చేస్తే మట్టుకు థియేటర్‌లో అలాంటి సీన్లకు విజిల్స్ పడతాయి. మరీ ముఖ్యంగా ఆయన విలన్స్‌తో చెప్పే డైలాగ్స్.. వార్నింగ్స్ వేరే లెవల్లో ఉంటాయి. ఇక ఆయన విలన్లు కూడా బాలయ్యకు ధీటుగా ఊరమాస్‌గా ఉంటారు. అయితే తాజాగా భగవంత్ కేసరి విలన్ లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇందులో విలన్ సూటు బూటు వేసుకుని క్లాస్ లుక్‌లో ఉన్నాడు. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తున్నాడు. మొదటి నుంచి బాలయ్యను అంత ఊరమాస్‌గా చూపించి.. విలన్‌ను ఇంత క్లాస్‌గా చూపించడంతో అభిమానులు ఒక్క సారిగా షాక్ అయ్యారు. మరోవైపు ఇలాంటి క్లాస్ విలన్‌తో బాలయ్య వేట ఎలా ఉంటుందోఅని అమితాసక్తి చూపిస్తున్నారు. ఇక ఈ సినిమా ట్రైలర్ ఆదివారం రాత్రి 8 గంటల 16 నిమిషాలకు రిలీజ్ కానున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఇక ఈ సినిమా బిజినెస్ ఓ రేంజ్‌లో జరుగుతుందని ఇన్‌సైడ్ టాక్. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాకు సుమారుగా రూ.60 కోట్ల రేంజ్‌లో బిజినెస్ జరుగుతుందని తెలుస్తుంది. ఇక రెస్ట్ ఆఫ్ ఇండియా, ఓవర్సీస్ కలుపుకుంటే మరో రూ. 20 కోట్లు ఈజీగా బిజినెస్ జరుగుతుందట. మొత్తంగా చూసుకుంటే బాలయ్య కెరీర్‌లోనే అత్యధికంగా రూ.80 కోట్ల రేంజ్‌లో బిజినెస్ జరుపుకుంటుందట. ఇది బాలయ్య కెరీర్‌లో ఆల్‌టైమ్ రికార్డు. పోటీగా లియో, టైగర్ నాగేశ్వరరావు వంటి సినిమాలున్నా ఈ రేంజ్‌లో బాలయ్య సినిమాకు బిజినెస్ జరుగుతుందంటే మాములు విషయం కాదు. అనీల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో బాలయ్యకు జోడీగా కాజల్ అగర్వాల్ నటిస్తుంది. శ్రీలీల కీలక పాత్ర చేస్తుంది.





సోమవారం 09, అక్టోబర్ 2023
www.warangalvoice.net



# విజయం ఖరారైంది

**గులాబీ జెండా నీడలోనే అభివృద్ధి, సంక్షేమం**

**కాంగ్రెస్ మాట నమ్మితే మునుగుడే**

**మంత్రి కల్వకుంట్ల తారకరామారావు**

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ఎలక్షన్ షెడ్యూల్ వచ్చింది, భూపలపల్లి విజయం ఖరారైంది. మళ్లీ గులాబీ జెండానే కచ్చితంగా ఎగురుతుందనడంలో ఏ అనుమానం లేదు. ఇక్కడకు వచ్చిన వారందరూ ఓ విషయం ఆలోచించాలి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించిన మంత్రి కేటీఆర్ సమీకృత కలెక్టరెట్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. డబుల్ బెడ్రూం ఇండ్లతోపాటు గృహలక్ష్మి, దళితబంధు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. జయశంకర్ సార్ పేరు మీద కలెక్టరెట్?ను ప్రారంభించే అవకాశం నాకు దక్కడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. తొమ్మిదిన్నరేండ్ల కింద భూపలపల్లి ఎలా ఉండే.. ఇప్పుడు ఎలా ఉంది? ఆనాటి తెలంగాణలో రైతు పరిస్థితి..ఈ రోజు రైతు పరిస్థితి ఏంది? ఆనాడు తాగునీటి పరిస్థితి ఏంది.. ఈనాడు తాగునీటి పరిస్థితి ఏంది? 2014లో కరెంట్ పరిస్థితి ఏంది.. ఈ రోజు తెలంగాణలో కరెంట్ పరిస్థితి ఏంది? ఆనాటి సాగునీటి పరిస్థితి ఏంది.. ఈనాటి సాగునీటి పరిస్థితి ఏంది? అప్పుడు సంక్షేమం ఏంది.. ఇప్పుడు సంక్షేమం ఏంది? గుండె మీద చేయి వేసుకొని ఆలోచించాలంటూ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు కోరారు.



వీటి గురించి మీరు మీ చుట్టుపక్కల వాళ్లకు చెబితే రమణారెడ్డి 60, 70 వేల మెజారిటీతో గెలుస్తారన్నారు. ఆరు దశాబ్దాలు అప్పటి ప్రభుత్వాలు చేయలేని పనిని ఒక దశాబ్దం కూడా నిండాకుండానే మన ప్రభుత్వం చేసిందన్నారు. ఈరోజు మీ ఇంటి ముందు ఉన్న నల్లా తిప్పితే ఆ నల్లా నుంచి వచ్చే నీటిలో మన నాయకుడు కేసీఆర్ కనబడతాడన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత 70 లక్షల మందికి రైతుబంధు అందుతోందని వివరించారు. ఆడబిడ్డల పరిస్థితి చూసి ఇంటింటికి నీళ్లు ఇచ్చారన్నారు. నీళ్లివ్వకపోతే ఓటు అడుగనని చెప్పిన దమ్మున్న నాయకుడు మన కేసీఆర్ అని ప్రకటించారు.

## పులి బయటికి వస్తది..

ఓటుకు నోటు కేసులో డబ్బు కట్టలతో అడ్డంగా దొరికిన వ్యక్తి మనకు పోటీనా? అంటూ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీని ముద్దపప్పు అని, సోనియ గాంధీని బలిదేవత అన్నోడు ఇప్పుడు వారికి ఓట్లు వేయాలని అంటున్నాడని, ఇటువంటోడిని నమ్ముదామా? అన్నారు. నోట్ల కట్టలతో అడ్డంగా దొరికిన దొంగ, క్రిమినల్ చేతిలో రాష్ట్రాన్ని పెడదామా? మొన్న ఓటుకు నోటు.. ఇప్పుడు సీటుకో రేటు. అందుకే ఆయనను రేవంత్ రెడ్డి అనడం లేదు.. రేటేంత రెడ్డి అంటున్నారంటూ ఎద్దేవా చేశారు. పులిని చూసి నక్క వాత పెట్టుకుంటే అది పులి అవుతుందా అంటూ ప్రశ్నించారు. రేపోమాపో పులి కేసీఆర్ బయటకు వస్తాడు.. ఏం చేయబోయేది ఆయననే చెబుతాడు అన్నారు. మీ మనసులో మాట కేసీఆర్‌కు తెలుసు. త్వరలోనే పెన్షన్ పెంచే విషయాన్ని సీఎం కేసీఆర్ ప్రకటన చేయబోతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు చెబుతున్నారు. వాళ్ల పార్టీకే వారెంటీ లేదు.. వాళ్ల గ్యారెంటీలు ఎవరు నమ్ముతారన్నారు. కాంగ్రెస్, బీజేపీలు టికెట్లు ఢిల్లీలో ఇస్తాయి. వాళ్లు బాత్రూం పోవాలన్నా.. అనుమతి కావాల్సిందే. అటువంటి బానిసలు మనకు అవసరమా? గల్లీని నడిపేందకు ఢిల్లీ దిక్కు చూసేవాళ్లు మనకు అవసరమా? తెలంగాణ ప్రజల మీద ప్రేమ కేసీఆర్?కు ఉంటదా.. వాళ్లకు ఉంటదా? ఆలోచన చేయాలన్నారు. ఏ గట్టున ఉండాలో మీరే తేల్చుకోవాలి, ఆగం కావొద్దు అంటూ పిలుపునిచ్చారు.

# పశ్చిమ ఎంసీపీఐ(యూ) అభ్యర్థిగా గడ్డం నాగార్జున





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ శాసనసభ నియోజకవర్గ ఎంసీపీఐ(యూ) అభ్యర్థిగా గడ్డం నాగార్జున పేరును ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్ది కాయల అశోక్ ఓంకార్, బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ నల్ల సూర్యప్రకాష్ అధికారికంగా ప్రకటించారు. హైదరాబాదులోని ఓంకార్ భవన్ లో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ.. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ సర్కారు ప్రజల ఆశల్ని అడియాశలు చేసిందని ఆరోపించారు. పూలే, అంబేద్కర్, కారల్ మార్క్స్ ఆలోచన విధానాన్ని జోడించి రాష్ట్రంలో ప్రజల ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, సమన్యాయం సాధించడం కోసం ఎంసీపీఐ(యూ), మాఎల్ఎఫ్ కలిసి పోరాటం చేస్తుందన్నారు. అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సబ్ ప్లాన్ చట్టాలను సవరించి ప్రజలకు అనుగుణంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. పశ్చిమ నియోజకవర్గాన్ని విద్య హబ్ గా మారుస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి ప్రతి పేద విద్యార్థికి ఉచిత విద్య అందేలా పథకాలు తీసుకొస్తామన్నారు. ప్రైవేటు యూనివర్సిటీలను రద్దుచేసి ప్రభుత్వ యూనివర్సిటీలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. ప్రతి ఏటా రెండు లక్షల ఉద్యోగాల నోటిఫికేషన్ వేస్తుందన్నారు. ఇల్లు లేని ప్రతి పేద కుటుంబాలకు ఇల్లు కట్టిస్తామన్నారు. ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకున్న వారికి హక్కు పత్రాన్ని ఇస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భూములను గుర్తించి పేదలకు పంచుతామన్నారు. బీఎల్ఎఫ్ బలపరిచిన ఎంసీపీఐ(యూ) వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ అభ్యర్థి ఎంపికకు సహకరించిన ఎంసీపీఐ(యూ) పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ గాదగోని రవికి, పార్టీ పొలిటి బ్యూరో సభ్యులు వల్లేపుఉపేందర్ రెడ్డికి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హేమ్రెడ్డి హంస రెడ్డికి, గోనె కుమారస్వామి, పెద్దారపు రమేష్, మంద రవి, బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# జిల్లా మేరు సంఘం ఎన్నిక




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ జిల్లా మేరు సంఘం నూతన కమిటీని సోమవారం నగరంలోని పోతన విజ్ఞాన పీఠం ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 13 మండలాలు, నాలుగు పట్టణాల మేరు సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అడాక్ కమిటీ కన్వీనర్, రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు తాళ్ల సంపత్ కుమార్ మేరు, కర్నె రవీందర్ మేరు, జిల్లా ఎన్నికల అధికారి గూడూరు బాలాజీ పర్యవేక్షణలో వరంగల్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పెండ్యాల హరిప్రసాద్ (నెక్కొండ), ప్రధాన కార్యదర్శిగా దోమకొండ శ్రీనివాస్ (వర్ధన్నపేట), కోశాధికారిగా రామగిరి యాదగిరి స్వామి (నర్సంపేట), ఉపాధ్యక్షులు గా పొడిశెట్టి సుభాష్ (సంగెం), రామగిరి నాగరాజు (నర్సంపేట టౌన్), కొత్తకొండ విద్యాసాగర్ (నెక్కొండ టౌన్), నందగిరి రజినీకాంత్ (ఖానాపురం), పెండ్యాల శ్రీధర్ (పర్వతగిరి), కార్యదర్శులుగా గట్ల కృష్ణ (చెన్నారావుపేట), సంగ సంజీవ (ఖిలా వరంగల్), రామగిరి యాదగిరి (రాయపర్తి), అడప నర్సింగరావు (నల్లబెల్లి), దీకొండ యుగంధర్ (వర్ధన్నపేట టౌన్), నిర్వహణ కార్యదర్శులుగా నన్నే రాజు (దుగ్గొండి), గూడూరు భాస్కర్ (ఖిలా వరంగల్), రామగిరి గురునాథ్ (గీసుగొండ), సోమ శివకుమార్ (వరంగల్), కర్నె రవీందర్ (వరంగల్ సిటీ)ను ఎన్నుకున్నారు.

# ఘనంగా కాకతీయ లైటింగ్ సౌండ్స్ మిత్ర పరపతి సంఘం ప్రథమ వార్షికోత్సవం

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలోని శంభునిపేట ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ లో కాకతీయ లైటింగ్ అండ్ సౌండ్స్ మిత్ర పరపతి సంఘం ప్రథమ వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు. కోట కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్.అమర్నాథ్, టి.రమేష్, జి.సాంబయ్య, పి.రాజయ్య హాజరయ్యారు. ప్రధాన కార్యదర్శి మీర్జాఇనాయితుల్లా బేగ్ అత్తర్ మాట్లాడుతూ సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి సహకారం అందించడమే పరిపతి సంఘం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం గత కమిటీని సభ్యులు అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కోశాధికారి నంద రమేష్ నివేదికను సమర్పించారు. సభ్యులు ఆర్థిక క్రమశిక్షణను, సమయాన్ని పాటిస్తూ సంఘం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. అనంతరం అధ్యక్షుడు కోట కుమార్, ప్రధాన కార్యదర్శి మీర్జా ఇనాయితుల్లాబేగ్ అత్తర్, ఉపాధ్యక్షులు ఆమంచ శ్యాంసుందర్, తౌటం రవి, సహాయ కార్యదర్శి కాటం సతీష్, కోట విజయ్, కోశాధికారి నంద రమేష్, సహాయ కోశాధికారి



ఆవునూరి రాజేష్, ఆర్గనైజర్స్ మీర్జా అజిజుల్లాబేగ్, కంచ శివ, కోట హేమంత్, సయ్యద్ అశ్రద్ మున్న, ముఖ్య సలహాదారులు కొండి కనకయ్య, పూల బోయిన పులి రాజ్, పరబోయిన ఓదేలు, మండల నరసింహా రాములు, సింగిరెడ్డి ఉపేందర్ అను సభ్యులు ఘనంగా సత్కరించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com


వరంగల్ వాయిస్ ఎడిటర్
రాష్ట్ర విశిష్ట పురస్కార అవార్డు గ్రహీత
శ్రీ గడ్డం కేశవమూర్తి గారికి
MA., PGDCJ
హృదయపూర్వ పుట్టిన రోజు
శుభాకాంక్షలు..
గట్టిగా అనుకున్నడు..
'గడ్డం'ను ఒక బ్రాండ్ గా నిలిపిండు
ఇగో, గిగోలు వద్దనుకున్నడు..
ఇంతింతై వటుడంతైండు
అందరినీ నావోళ్లే అనుకున్నడు..
వాళ్లందరికీ పెద్దన్న అయ్యిండు
గంపెడు బాధలతో వచ్చినోళ్లకు..
గుమ్మెడంతా మందైండు
ఏదన్నా రాని, ఏమైనా కాని..
గుట్టోలే వెనకుంటడు
కలిమికి, బలిమికి..
కేరాఫ్ అడ్రస్ అయ్యిండు..
మళ్లొక్క బర్త్ డే ..
'కేశవన్న' కీర్తి
మరింత పెరుగుడే!
నిండు నూరేళ్లు
ఆయురారోగ్యాలతో
చల్లగా జీవించాలని
ఆ భగవంతున్ని
కోరుకుంటూ..
HAPPY
BIRTHDAY
వరంగల్ వాయిస్
Evening Daily
Family Members
& Staff Members